

# మాతృదేవోభవ

## ప్రతి నెలా ఒక పాఠకుడి / పాఠకురాలి మాతృమూర్తికి వందనాల హరిచందనాలు

ప్రమీలా చంద్రమోహన్



'అమ్మ' అనేదే ఒక తీయని కమ్మని మాట. ఒక కమ్మని కావ్యం. ఏ భాషలో అయినా 'అమ్మా' అనే శబ్దం ఒకేలాగా పలుకుతుంది. పిల్లలు గాని, పెద్దలు గానీ సంతోషమయినా, బాధ అయినా పలికించడానికి వాడే పదం 'అమ్మ'. 'ఎవరు రాయగలరూ అమ్మ కన్న చల్లని మాట, ఎవరు పాడగలరూ అమ్మ కన్న కమ్మని పాట.

మా అమ్మ శ్రీమతి మద్దూరి లీలావతి దేవి. ఆ రోజుల్లోనే (1946) బి.ఎ. గణిత శాస్త్ర పట్టభద్రురాలయి అందరి చేతా ముక్కుమీద వేళ్ళు వేయించుకుంది. అలనాటి గణితశాస్త్ర విశారద అయిన ఆ 'లీలావతి'లాగే పేరుగాంచింది. చదువు తప్ప పనిపాటల అవసరం లేని పెద్ద కుటుంబం నుంచి వచ్చి, చెన్నపట్నం చేరిన ముద్దరాలు. రకరకాల వంటలు నేర్చుకుని భర్తని, పిల్లలనే కాక అతిధి, అభ్యాగతులను, బంధు బలగాన్ని ఆదరించిన ఇల్లాలు.

*చక్కని గృహిణి*

ఒక మంచి ఇల్లాలిగా తన భర్త ఉన్నత శిఖరాలనధిరోహించడానికి కావాల్సిన తోడ్పాటు, చాపకింది నీరులా అందించింది. దేశ, విదేశాల్లో ఖ్యాతి నార్జించుకుంటున్న భర్తకు ఇంట్లో శాంతి, సౌఖ్యాలను అందించటమే కాని, ఇంటి బాధ్యత, పిల్లల బాధ్యతను ఎన్నడూ ఆయన భుజస్కంధాల మీద పెట్టలేదు. ఎన్నో చిన్న, చిన్న చీకాకులను తనే అధిగమించేది. ఇంటికి వచ్చిపోయే చుట్టాలు, ఇంట్లోనే ఉండే బంధువులు అతిధి, అభ్యాగతులు, వారి మర్యాదలు వారి వారి ఈతిబాధలు, హాస్పిటల్ చుట్టూ తిరగటాలు అన్నీ తనే చూచుకునేది. భర్తకి కావలసిన, పిల్లలకు కావలసిన సరంజామాయే కాదు, ఇంటికి కావలసిన బట్టలు, పాత్రలు అన్నీ తనే చూడవలసి వచ్చేది. ఒక్కనాడు కూడా విసుగు దరిచేరనిచ్చేది కాదు. అందరికీ అన్నివిధాల సుఖాన్నిచ్చేందుకే శ్రమించేది. ఎంతోమంది, ఎవ్వరింటికీ రాని ప్రముఖులు వస్తే చక్కని ఆతిధ్యమందించేది. ఉన్నది నలుగురు పిల్లలయినా నలుగురు నాలుగురకాల వంటలడిగేవారు. అందరికి చేసిపెట్టేది. ఒకే కూర (వంకాయ) నాలుగురకాలుగా చేస్తేగాని తృప్తిపడని పిల్లలు, ఎల్లవేళలా ఇంకో ఎక్స్ట్రా విస్తరి వేస్తేకాని కుదరని ఇల్లు, ఎల్లవేళలా చిరుతిండి అడిగే భర్త, పిల్లలు, ఎప్పుడు లేచేదో, ఎప్పుడు చేసేదో ఎవరికీ తెలియదు. ఒక్క పని మనిషి తప్ప చేతికింద సాయంలేదు. అయినా చక్కని గృహిణిగా పేరు తెచ్చుకుంది.

*తల్లి, గురువు, దైవం*

ఆమెకి చాల చిన్నతనంలోనే పెళ్ళయిన మూడేళ్ళకి, అయిదేళ్ళ వారలో నలుగురు పిల్లలు. ఆ పిల్లలని అందర్నీ పైకి తీసుకురావటానికి ఎంత శ్రమించేదో భగవంతుడికే తెలుసు. పిల్లలకు రోగమొచ్చినా, నెప్పి వచ్చినా ఏమి వచ్చినా అంతా తనే చూడాలి. రోగిని కనిపెట్టుకోవటమే కాక, కాలు వచ్చిన మిగతా పిల్లలు అల్లరి చేయకుండా, బయటికి పారిపోకుండా పట్టుకోవాలి. వాళ్ళ చదువు, సంధ్యలు చూడాలి, చక్కని బడిలో వేయటమే కాక, వాళ్ళ చదువుల పర్యవేక్షణ. చదువులో, పిల్లలు ప్రథమ శ్రేణిలోనే ఉండాలి. వాళ్ళకి ఆటపాటల్తో చదువు చెప్పాలి. పిల్లలకి చిన్న తనంలో నిద్రపుచ్చటానికి కథలు, పద్యాలు చెప్పాలి. ఇంట్లో బంధువులను చూడాలి. మద్రాసు లాంటి మహా నగరంలో దుండగుల మోసాలకు గురికాకుండా తన కుటుంబాన్ని రక్షించాలి. అంతే కాకుండా ముఖ్యమైన వన్నీ చూపించాలి. క్వీన్ ఎలిజిబెత్ మద్రాసుకు వస్తే ఆమెను చూపించాలి. హార్బర్, ఎయిర్ పోర్ట్ బయట నుంచి చూపటమే కాక ప్లేన్ లోపలికి, షిప్‌లోకి తీసుకెళ్ళాలి. సినిమా షూటింగ్స్ చూపాలి. మంచి విజ్ఞాన చిత్రాలు చూపాలి. కేవలం చదువేకాక ఎక్స్‌ట్రా కరిక్యులం యాక్టివిటీస్‌లో పిల్లలు పాల్గొనాలి. ప్రపంచంలో ఒంటరిగా మనగలగాలి. లోకజ్ఞానం తెలియాలి. ఇలా నలుగురి పిల్లలను పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌ని చేయించిందంటే ఆమె శ్రమ ఎంతో ఎవరికి తెలుసు!? తను పట్టభద్రురాలయినా ఎం.ఎ లో కూడా పిల్లలకి అవసరమైతే నోట్స్ రాసిపెట్టేది. వాళ్ళు అర్ధరాత్రి దాకా మేలుకుంటే, నేనూ మీతో మెలుకువగా ఉంటాననేది. తెల్లవారు ఝామున లేపాల్సివస్తే లేపేది. వారికి ఏ టైములో ఏది కావాల్సివచ్చినా చేసి పెట్టేది. పిల్లలకు ఏ రోగమయినా వస్తే ఇంటిపనులు ఎప్పుడూ చేసుకునేదో తెలియకుండా ఆమె ఆరోగిని అహర్నిశలూ కనిపెట్టుకుని ఉండేది. పిల్లలకు ఎవరిలో నయినా మంచిని మాత్రం చూపటము నేర్పింది. వాళ్ళలో చెడ్డతనాన్ని పాయింటవుట్ చేస్తే, మనవైపు మూడువేళ్ళు చూపిస్తాయి. అందరూ పర్‌ఫెక్ట్ కాదు. మంచే చూడమని నొక్కి వక్కాణించేది. ఈ రోజు నలుగురు పిల్లలు పై వచ్చి పేరుగాంచారంటే ఆ అమ్మ చలవే. ముఖ్యంగా ఈ రోజు ఆమె పోయి పదేళ్ళు అయినా నల్గురు పిల్లల మధ్య ప్రేమానురాగాలు ఉండి, కష్టసుఖాలు పంచుకుంటున్నారంటే ఆ తల్లి నేర్పిన క్రమశిక్షణాను రాగాలే కారణం..

<u>ఆమె ప్రయోజకత్వం</u>

చిన్న, చిన్న పిల్లలతో మూడు నెల్లకొకసారి పుట్టింటికి, అత్తింటికి పిల్లలు స్కూల్లో చేరకముందు ఒంటరి ప్రయాణాలు చేయటము ఆ రోజుల్లో ఎవరూ, కనీ, వినీ ఎరుగరు. మద్రాసులాంటి మహానగరాల్లో, రకరకాల మోసాలు. అందులో భర్త సగం రోజులు ఊర్లో ఉండరు. ఉన్నా ఎప్పుడో పొద్దున వెళ్ళి, ఏ రాత్రికో వస్తారు. ఇది జగమెరిగిన సత్యం. అయినా ఏమీ తెలియని అమాయకురాలుగా పెరిగిన ఆమె ఒంటరిగా ఎన్నో ఏళ్ళు నిభాయించుకొచ్చేది. డాక్టర్లు, మందుల షాపులు, బట్టల షాపులు, కిరాణా కొట్లు హాస్పిటల్స్ అన్నీ తను ఒక్కత్తే తిరగాల్సి వచ్చేది. ఇవిగాక భర్తకి, భర్తపోయాక కొడుక్కి ఆఫీస్ అకౌంట్స్ చూడాల్సి వచ్చేది. ఇంట్లో గృహిణి సేవేగాక భర్తతో పార్టీలు, ఫంక్షన్స్‌కి అటెండ్ కావాల్సి వచ్చేది. మధ్య, మధ్యలో భర్త సరదా టూర్స్ అంటే పిల్లల్ని వదలలేక, భర్తతో పోలేక ఇబ్బంది పడేది. చిన్నతనంలో మహిళా మండలిలో వాలంటరీగా టీచింగ్ చేసేది. రేడియో టాక్స్ ఇచ్చేది. తర్వాత అన్నీ వదిలేసుకుని పిల్లల పెంపకము బాధ్యత చేపట్టింది. పిల్లలు పెద్ద వాళ్ళయ్యాక ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా చేసింది.

ఇట్టి బహుముఖ ప్రజ్ఞాశీలి మా అమ్మ. ఆమెకి నీరాజనమే ఈ వ్యాసం రాసింది ఒకరయినా వ్రాయించింది నలుగురు పిల్లలు, వరస క్రమంలో వారి పేర్లు ప్రమీల, మీనా, రఘు, రాజ్ ఇవి నలుగురి భావాలు.



శ్రీమతి ప్రమీలా చంద్రమోహన్ గారు , ఎమెస్కో పబ్లికేషన్స్ స్థాపకులు శ్రీ ఎమ్.ఎన్. రావు గారి పెద్దకుమార్తె.

భర్త , రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీ చంద్రమోహన్ గారితో తిరుపతిలో నివాసం.